జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 25 | సెప్టెంబర్ | 2025 ◆ పేజీలు : 6

# మిస్టరీగా మారిన.. మిస్సింగ్ కేసు...?

- రామ్మూర్తి మిస్సింగ్ – భార్య ఆవేదన



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):** చుంచుపల్లి మండలానికి చెందిన ఊరుమ రామ్మూర్తి (జూనియర్ అసిస్టెంట్) ఆగస్టు 18న మణుగూరులో అదృశ్యమయ్యాడు. నెలరోజులు గడిచినా ఆయన ఆచూకి తెలియకపోవడంతో భార్య త్రివేణి పోలీసుల ఎదుట విలవిల్లాడుతోంది. భార్య ఆరోపణ ప్రకారం.. కేవలం 30 వేల రూపాయల అప్పు, కానిస్టేబుల్ కుటుంబం ఒత్తిళ్లు, అనుమానాస్పద ఫోన్ కాల్స్.. ఇవన్నీ ఈ కేసును మిస్టరీగా మార్చాయి. కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఈ అంశంపై స్థానికుల్లో పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. “నా భర్త బ్రతికే ఉన్నాడా? లేక చనిపోయాడా? కనీసం జాడ చెప్పడంలేదు” అని త్రివేణి ఆవేదన వ్యక్తం చేస్తుండగా, పోలీసులు మాత్రం ఇలాంటి పురోగతి తెలపడం లేదు. ఎఫ్ఐఆర్ నమోదు అయిన పోలీసులు మౌనం వహించడం ఈ కేసుపై మరింత ప్రశ్నార్థక పరిస్థితి నెలకొల్పుతోంది.



# పేదవారు ఆత్మగౌరవంతో జీవించాలి

- ఈ ప్రజాప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఆర్థిక భరోసా కలుగుతుంది
- రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాబోయే మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమం అందిస్తాం......
- రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 966మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళ మంజూరి చెక్కుల పంపిణీ పత్రాలు
- 19 మందికి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- ఆత్మ కమిటీ చైర్మన్ గా సుంకవల్లి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి
- తెలంగాణ ప్రభుత్వంలో పేదవారికి నేరుగా లబ్ది చేకూరుతుంది... ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- పేద వర్గాల సంక్షేమానికి కృషి.. కలెక్టర్ జితేష్ వి పాటిల్

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 24, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పేదవారు ఆత్మగౌరవంతో జీవించేలా ఈ ప్రజా ప్రభుత్వంలో ఆర్థిక భరోసా కలుగుతుందని రైతు సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని రాబోయే మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమం ఫలాలను అందించే బాధ్యత ఈ ప్రభుత్వాన్ని దేనిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో ఆత్మ కమిటీ నూతన చైర్మన్ గా సుంకపల్లి వీరభద్రరావుతో పాటు 24 మంది సభ్యులతో ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతుగా అత్యంత అనుభవం కలిగిన పెద్దాయన సుంకవల్లి వీరభద్ర రావుకు ఈ పదవి దక్కడం ఆనందంగా ఉందన్నారు. రైతు, పేదవర్గాలు అభ్యున్నతి కోసం వారి సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా

మిగతా 2 లో...



# అక్రమ సం"బంధ"మే హత్యకు కారణం

- 36 గంటలలో కేసు చేదించిన పోలీసులు
- హత్య కేసులో నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డిఎస్పి రెహమాన్

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):** కొత్తగూడెం పట్టణంలోని గణేష్ టెంపుల్ ఏరియాలో సోమవారం రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు 36 గంటలలో ఛేదించామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి వివరాలు వెల్లడించారు. ఈ నెల 22 సోమవారం రాత్రి గణేశ్ టెంపుల్ ఏరియాలోని తన ఇంట్లో గుబ్బల రాంమోహన్ రావు భోజనం చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మారణాయుధాలతో ఇంటిలోకి ప్రవేశించి రాంమోహన్ రావుని కొడుతూ ఉండగా భయంతో అతను ఇంటిలో నుండి బయటకు ఎవరైనా కాపాడుతారనే ఉద్దేశంతో బయటకు వచ్చాడని, అతడిని ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో

మిగతా 2 లో...

# బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

- సీఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు ఉత్తర్వుల విడుదల



**కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 24, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థలో బదిలీ వర్కర్లుగా చేరి భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనులు లేదా సర్ఫేస్ లో పనిచేస్తూ 190/240 మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ అసిస్టెంట్ కేటగిరి – 1 గా క్రమబద్దీకరి అంటున్నట్లు సీ అండ ఎం డీ ఎన్.బలరాం తెలిపారు. 2024 డిసెంబర్ 31 మరియు అంతకు ముందు తమ సంవత్సరకాలం సర్వీసు చేసిన వారిని భూగర్భ గనుల్లో

మిగతా 2 లో...

# 71 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టులలో 21 మంది మహిళలు, 50 మంది పురుషులు
- వీరిలో 30 మంది మావోయిస్టులపై 64 లక్షలు రివార్డ్

**చర్ల, సెప్టెంబర్ 24, (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ దంతేవాడ బస్తర్ డివిజన్ లో కొనసాగుతున్న పూనా మార్గెం (పునరావాసం ద్వారా పునరుజ్జీవనం) ప్రచారం, దంతేవాడ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ లోన్ వర్రాటు మంచి ఫలితాలను చూపిస్తున్నాయి. బుధవారం దంతేవాడ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన లొంగుబాటు కార్యక్రమంలో మొత్తం 71 మంది మావోయిస్టులు

మిగతా 2 లో...



## బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్లుగా క్రమబద్ధీకరణ

(మొదటి పేజీ తరువాయి...)

అయితే 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనుల్లో లేదా సర్ఫేస్ లో అయితే 240 మస్టర్లు పూర్తి చేసి ఉన్న బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి–1 గా క్రమబద్ధీకరించడానికి యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు సీ అండ్ ఎం డీ పేర్కొన్నారు. ఈ క్రమబద్ధీకరణ విషయమై సింగరేణి సీఎండీ శ్రీ ఎన్. బలరామ్, డైరెక్టర్ పర్సనల్ శ్రీ గౌతమ్ పొట్రు లతో గుర్తింపు కార్మిక సంఘం నాయకులతో చర్చల అనంతరం సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. కాలరీస్ **ఏరియాల వారీగా:** రామగుండం–2 ఏరియాలో 303 మంది బదిలీ వర్కర్లను జనరల్ అసిస్టెంట్ కేటగిరి–1 గా క్రమబద్ధీకరించటం జరుగుతుంది. అలాగే భూపాలపల్లి ఏరియాలో 250 మందికి, శ్రీరాంపూర్ ఏరియాలో 241 మందికి, రామగుండం–3 & అడ్రియాల ఏరియాలలో 167 మందికి, రామగుండం–1 లో 156 మందికి, మందమర్రిలో 64 మందికి, కార్పోరేట్ లో 21 మందికి, కొత్తగూడెం ఏరియాలో 20 మందికి, మణుగూరు ఏరియాలో 19 మందికి, బెల్లంపల్లి ఏరియాలో 11 మందికి, ఇల్లందు ఏరియాలో ఆరుగురికి జనరల్ అసిస్టెంట్ కేటగిరి–1గా క్రమబద్ధీకరించే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

## 71 మంది మావోయిస్టులు లొంగుబాటు



(మొదటి పేజీ తరువాయి...)

లొంగిపోయారు, వీరిలో 30 మంది మావోయిస్టులపై 64లక్షల రివార్డ్ ఉన్నది. లొంగిపోయిన వారిలో 21 మంది మహిళలు , 50 మంది పురుష మావోయిస్టులు ఉన్నారు. మేజర్ మావోయిస్టులు ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోయారు. బామన్ మద్కం ( 8 లక్షల రివార్డ్) – అనేక ప్రధాన నక్సలైట్ ఎన్ కౌంటర్లలో పాల్గొన్నాడు. షామిలా అలియాస్ సోమ్లి కవాసి ( 5 లక్షల రివార్డు) – మొబైల్ టవర్లను తగలబెట్టడం, ఎన్ కౌంటర్లలో పాల్గొన్నాడు. గంగి అలియాస్ రోహ్నిబార్సే (5 లక్షల రివార్డ్) – భైర్మగఢ్ ఏరియా కమిటీలో క్రియాశీల సభ్యుడు. దేవే అలియాస్ కవితా మద్వి ( 5 లక్షల రివార్డు) – వైద్య బృంద కమాండర్, అనేక ఎన్ కౌంటర్లలో పాల్గొన్నాడు. జోగా మద్కం (2 లక్షల రివార్డ్) – అనేక పోలీసు–నక్సలైట్ల ఎన్ కౌంటర్లలో పాల్గొన్నారు .లొంగిపోయిన ఇతర మావోయిస్టులు బంద్ సమయంలో రోడ్లు పాడుచేయటం , చెట్లను నరికివేయడం, నక్సలైట్ పోస్టర్లు , బ్యానర్లు ఇతర హింసాత్మక కార్యకలాపాలలో పాల్గొన్నారు. లొంగిపోయే డ్రైవ్ కు ఐజి బస్తర్ రేంజ్ సుందర్ రాజ్ పి., దంతేవాడ రేంజ్ డిఐజి కమలోచన్ కశ్యప్, సిఆర్ పిఎఫ్ డిఐజి (ఆపరేషన్స్) రాకేష్ చౌదరి, ఎస్పీ గౌరవ్ రాయ్, సిఆర్ పిఎఫ్ , జిల్లా పోలీసు దళాల సీనియర్ అధికారులు నాయకత్వం వహించారు. ప్రభుత్వ సరెండర్ పునరావాస విధానం 2025 ప్రకారం, లొంగిపోయిన అందరు మావోయిస్టులకు ₹ 50,000 తక్షణ సహాయం, నైపుణ్య అభివృద్ధి శిక్షణ, వ్యవసాయ భూమి స్వయం ఉపాధి అవకాశాలు, మానసిక కౌన్సెలింగ్, సామాజిక పునరావాసం భద్రతా ఏర్పాట్లు అందించబడతాయి అని అధికారులు తెలిపారు . ఇప్పటివరకు, లోన్ వర్రాటు ప్రచారం కింద 1,113 మంది మావోయిస్టులు లొంగిపోయారు, వారిలో 297 మంది రివార్డులు కలిగి ఉన్న మావోయిస్టులు ఉన్నారు. దంతెవాడ జిల్లాలోనే గత 19 నెలల్లో 461 మంది నక్సలైట్లు లొంగిపోయారు, వీరిలో 129 మంది మావోయిస్టులు రివార్డులతో ఉన్నారు . పూనా మార్గెమ్ లోన్ వర్రాటు ఆపరేషన్లు జన జీవ స్రవంతిలోకి తిరిగి వచ్చి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశాన్ని కల్పిస్తాయి అని మావోయిస్టులందరూ తమ కుటుంబాలు సమాజం కోసం హింస మార్గాన్ని విడిచిపెట్టి శాంతి అభివృద్ధిని స్వీకరించాలి అని పోలీసులు తెలిపారు.

# పేదవారు ఆత్మగౌరవంతో జీవించాలి





(మొదటి పేజీ తరువాయి...)

ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ. 500 కే గ్యాస్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 11 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు సుమారు 7 లక్షల మంది పాత రేషన్ కార్డులలో పేరు నమోదు చేసి చరిత్ర సృష్టించమన్నారు. పేదవారు ఆత్మగౌరవంతో జీవించేందుకు అవసరమైన ప్రతి విషయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రతి సోమవారం నిధులు నేరుగా వారి ఖాతాలలోకే జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని ఎక్కడ అవినీతి చలగకూడదనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలతో వినూత్నంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 966 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించిన పొంగులేటి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల కింద 19 లబ్ధిదారులకు సుమారు రూ.19. 02 లక్షల చెక్కుల ను అందించారు.

### ››› ప్రతి పేదవారికి నేరుగా లబ్ధి చేకూరుతుంది.. ఎమ్మెల్యే జారె

తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ లేకుండా ప్రతి పేదవారికి నేరుగా లబ్ధి చేకూరేలా అభివృద్ధి సంక్షేమం అందేలా పథకాలను ప్రవేశపెట్టి అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. బుధవారం ఆత్మ కమిటీ చైర్మన్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారి అశ్వారావుపేట నియోజకవర్గం లో ఆత్మ కమిటీని ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గం సహకారంతో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నామని, రైతులకోసం వారి సంక్షేమం కోసం అనేక మార్పులను తీసుకొస్తున్నామన్నారు. ప్రజల, రైతుల జీవితాలను సుస్థిరంగా చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

### ››› పేదవర్గాల సంక్షేమానికి కృషి.......కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమాలను పేద వర్గాలకు చేరేలా వారిని అన్ని విధాలుగా ఆదుకునే జిల్లా యంత్రాంగం మద్దతుగా ఉంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వ్యాపార ఉపాధి అవకాశాలు రైతు సమస్యల పరిష్కారం ప్రభుత్వం నుండి అందించే పథకాలలో పారదర్శకంగా పనిచేస్తామన్నారు. పేదవారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబు రావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు,ఇందిర మహిళల లబ్ధిదారులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.






## అక్రమ సం"బంధ"మే హత్యకు కారణం

(మొదటి పేజీ తరువాయి...)


వారి వెంట తెచ్చుకున్న పొడవైన పిడి గల సుత్తితో అతని తల పైన కొట్టగా అక్కడికక్కడే చనిపోగా, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి సారథ్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేయగా, సిసి ఫుటేజ్ ఆధారంగా విచారణ జరపి రామవరానికి చెందిన మహమ్మద్ షాహీర్, వాసంపల్లి వంశీ నిందితులుగా గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు, రామవరానికి చెందిన ఒక వివాహిత మహిళతో మృతుడికి గతంలో అక్రమ సంబంధం ఉన్నదని, ఆ మహిళ మృతుడితో కాకుండా షాహీర్ తో కూడా అక్రమ సంబంధం ఉండడంతో అడ్డుగా ఉన్న రామ్మోహన్ రావును తొలగించుకోవాలని షాహిర్, వంశీ తో కలిసి పథకం ప్రకారం మృతుని ఇంటికి వెళ్ళి అతి కిరాతకంగా తలపై సుత్తితో కొట్టి చంపారని తెలిపారు. నిందితులను గురువారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు. వీరి ఇరువుపై రౌడీ షీట్ కూడా ఓపెన్ చేయనట్లుగా తెలిపారు.క్షణికావేశంలో జరిగే ఇలాంటి ఘటనల వల్ల కుటుంబాలు ఇబ్బందుల పాలవుతాయన్నారు. ఈ ఘటనలో మృతుడి కుటుంబం ఇంటి పెద్దను కోల్పోగా మిగిలిన నిందితులు జైలు ఊచలు లెక్క పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు.హత్యలో పాల్గొన్న ప్రధాన నిందితుడు మహమ్మద్ షాహీర్ రామవరం సెంటర్లో మటన్ దుకాణం నడుపుకుంటాడని, అతనికి సహకరించిన మరో నిందితుడు వాసంపెల్లి వంశీ కార్ మెకానిక్ కాగా అతను కూడా రామవరం లోనే ఉంటున్నాడన్నారు. ఆ మహిళపై కూడా కేసు నమోదు చేస్తున్నామని, ప్రస్తుతం పరారీలో ఉందన్నారు.ఘటన జరిగిన వెంటనే ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ సైతం సీసీ ఫుటేజ్ సేకరణలో నిందితుల ఆనవాళ్లను గుర్తించే విషయంలో ప్రత్యేక చొరవ చూపారన్నారు.ఈ కేసును చేదించిన త్రీటౌన్ సీఐ శివప్రసాద్, వన్ టౌన్ సిఐ కరుణాకర్, టూ టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లను, సిబ్బంది డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- **ఒకరి పరిస్థితి విషమం**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (ప్రజాజ్యోతి):** చంద్రుగొండకు చెందిన మహమ్మద్ సాజిద్ పాషా సన్నాఫ్ ఇస్మాయిల్ 27 సం..వృత్తి చికెన్ షాపు తన మోటార్ సైకిల్ నెంబర్ (టిఎస్ 04ఈర్5185) మోటార్ సైకిల్ పై మంగళవారం కొత్తగూడెం వచ్చుచుండగా రాత్రి 9 గంటల సమయంలో ఫిల్టర్ బెడ్ దాటి కొద్ది దూరం వచ్చేసరికి వర్షం బాగా కురుస్తుండగా కొత్తగూడెం వైపు నుండి పెనగడప వైపుకు వెళుతున్న మోటార్ సైకిల్ పై భార్యాభర్తలు వెళ్ళుచు మోటార్ సైకిల్ నెంబర్ (టీఎస్ 28 బి 7039) రేరాకుల చెన్నారావు, నివాసం బైన గూడెం గ్రామం, పెనుబల్లి మండలం, ఖమ్మం జిల్లా అను వ్యక్తి మోటార్ సైకిల్ ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మహమ్మద్ సాజిద్ సాజిదు మోటార్ సైకిల్ పాషా మోటార్ సైకిల్ ను గుద్దగా మహమ్మద్ సాజిద్ భాషకు ముఖముపై మరియు ఇతర శరీర భాగాలపై బలమైన దెబ్బలు తగిలిన వని మహమ్మద్ సాజిద్ పాషాను గుద్దిన మోటార్ సైకిల్ పైన ఉన్న ఇరువురికి కూడా దెబ్బలు తగిలిన వని సమాచారం అందుకున్న టూ టౌన్ సీఐ ప్రతాప్ ప్రమాద స్థలమునకు వెళ్లి దెబ్బలు తగిలిన సాజిత్ పాషాను మరియు మిగతా ఇరువురుని కూడా అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం కొత్తగూడెం గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించగా మహమ్మద్ సాజిద్ భాష చికిత్స పొందుతూ రాత్రి గంటలకు చనిపోయినాడు.మిగతా వారిని మెరుగైన చికిత్స గురించి హైదరాబాద్ తరలించారు. టూటౌన్ సిఐ డి. ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





# సదాపూర్ణే.. శంకర ప్రాణవల్లభే

- మాతృస్వరూపమే.. అన్నపూర్ణాదేవి.... అర్చకులు కే. పుండరీ కాక్ష
- మూడవరోజు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మ





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 23, ప్రజా జ్యోతి:** సకల ప్రాణకోటికి జీవనాధారం అన్నం.. అందుకే అన్నన్ని పరబ్రహ్మ స్వరూపమని అంటారు. అందుకే ఈ తల్లిని సృష్టి పోషకరాలి రూపంలో కొలుస్తారని, అది భిక్షువైన ఈశ్వరునికి భిక్షపెట్టిన అమ్మ అన్నపూర్ణాదేవి. కావున ఈ తల్లిని స్మరించుకోవడం వల్ల మేధాశక్తి వృద్ధిచెందడంతోపాటు మధుర భాషణం, సమయస్ఫూర్తి, బుద్ధి, వాక్ సిద్ధి, ఐశ్వర్యం, సంపద ప్రాసాదిస్తుందని భక్తుల్లో విశ్వాసం, కావున ఈ రోజు భక్తులు పరిపూర్ణ భక్తితో పూజించి.. అన్నపూర్ణా అమ్మవారికి కేసరి, కొబ్బరి అన్నంను నైవేద్యంగా సమర్పిచాలని సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు కె. పుండరీకాక్ష అన్నారు. దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ కనక దుర్గ అమ్మవారు మూడవరోజు మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం. శ్రీ కన్యకపరమేశ్వరి ఆలయం శ్రీ కోదండ రామాలయం గుర్రాల చెరువు గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన శ్రీ కనక దుర్గమ్మ ఆలయం, డ్రైవర్స్ కాలనీలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంతో సహా పలు ఆలయాలలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

> ››› ఆహారంలోని అమ్మవారిని నమస్కరించుకోవడం అన్నపూర్ణాదేవి అవతార విశేషం.. అర్చకులు... కె. పుండరీకాక్ష

ఆహారంలో అమ్మవారిని దర్శించి నమస్కరించుకోవడమే ఈ తల్లి విశిష్టత, అవతార విశేషమని అర్చకులు పుండరీకాక్ష అన్నారు. నవరాత్రుల్లో అమ్మవారు బంగారురంగు చీర ధరించి అష్టభుజాలతో సింహవాహినిగా భక్తులకు దర్శనమిస్తుందని, కుడివైపు చేతుల్లో పద్యం, బాణం, ధనుస్సు, కమండలం ఎడమవైపు చేతుల్లో చక్రం, గదా, జపమాల, అమృత కలశాన్ని ధరించి ఆమె భక్తులను కరుణిస్తుందని, అందుకే ఈ తల్లిని పూజిస్తే ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తులకు వివరించారు. పాకనాటి వెంకటేశ్వారావు, మల్లిక దంపతుల సహకారంతో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఐటిడిఏ రహదారి మరమ్మతుల కోసం సిపిఐఎం నిరసన



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 24 ప్రజా జ్యోతి:** భద్రాచలం లోని ఐటిడిఎ రోడ్డు కొన్ని ఏళ్లుగా గుంతలతో నిండిన పరిస్థితిలో ఉండటంతో, సిపిఎం ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహం నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించి, ఐటిడిఎ కార్యాలయం ముందుకు ధర్నా చేపట్టారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ, భద్రాచలం పర్యటనలో పాల్గొన్న ఐఏఎస్ అధికారులు, జిల్లా కలెక్టర్ కూడా ఉపయోగించే ఈ రహదారి గత ఆరు నెలలుగా మరమ్మత్తులు చేయకపోవడం దుర్మార్గమని, దాంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు రద్దీగా ఉండే రోడ్డు గుంతల వల్ల ద్విచక్ర వాహనాలు, ఆటోలు కూడా ప్రమాదానికి గురవుతున్నాయని గత రెండు నెలలుగా సిపిఎం మాస్ లైన్ కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ రోడ్డు సందర్శనలో స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేసినట్లు ఏజే రమేష్ తెలిపారు. ఐటిడిఎ ప్రధాన రహదారి ఈ స్థితిలో ఉంటే, మారుమూల గిరిజన ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించగలమని ఆయన ప్రశ్నించారు. ధర్నా సమయంలో ఐటిడిఎ ఏవో వినతిపత్రాన్ని స్వీకరించి, రహదారి గుంతల సమస్య వాస్తవమేనని, ఉన్నతాధికారులకు నివేదించి వీలైన త్వరగా మరమ్మత్తులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, బండారు శరత్ బాబు, సున్నం గంగ, పారెల్లి సంతోష్ కుమార్, సతీష్ బాబు, బిబిజి తిలక్, ఎంకన్న, ఎం సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సివిల్ వర్క్ లను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ సౌరబ్ శర్మ




**పినపాక, సెప్టెంబర్ 24(ప్రజాజ్యోతి):** పినపాక మండలంలో వివిధ పాఠశాలలలో జరుగుతున్న సివిల్ వర్క్ ను అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సౌరబ్ శర్మ ఆకస్మికంగా పరిశీలించారు. బుధవారం ఆయన ఈ సందర్శనలో భాగంగా నూతన భవిత నిర్మాణాలు, దివ్యాంగుల నూతన మరుగుదొడ్ల నిర్మాణం, భవిత కేంద్రాల మరమ్మత్తులు, కేజీబీవీ లలో మరమ్మత్తులు, పి ఎం ఎస్హైచ్ఆర్ఐ ల్యాబ్ నిర్మాణం వంటి పనులను పరిశీలించారు. పనులు నాణ్యం గా ఉండాలని, ఎస్టిమేషన్ కు, డిజైన్ కు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని ఇంజనీర్ లకు సూచించారు. ఈ సందర్శనలో జిల్లా విద్యాశాఖ సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ యస్. కె. సైదులు, డిఈ నాగేశ్వర చారి, ఏ ఈ సత్య శ్రీనివాస్, మండల విద్యాధికారులు, వీరాస్వామి, నాగయ్య, ఐఈఆర్పి లు జాన్సీ, నాగశ్రీ, అంబికా, తదితరులు పాల్గొన్నారు.

## అజీంప్రేంజీ స్కాలర్‌షిప్‌లకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలి

- మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** అజీంప్రెంజీ స్కాలర్షిప్‌లకు బాలికలు దరఖాస్తు చేసుకోవాలనీ మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా మంగళవారం పాల్వంచలో జరిగిన సమావేశంలో తెలిపారు, ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సుల మొదటి సంవత్సరంలో చేరిన బాలికలు అజీంప్రెంజీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు, ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలల్లో 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన బాలికలు మాత్రమే ఉండాలని తెలిపారు. ఈ ఏడాది స్పాట్ అడ్మిషన్లు పొందిన బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు, ఈ స్కాలర్షిప్ కు ఎన్నికైన వారికి సంవత్సరానికి 30,000 పొందుతారని మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్ లో లేదా మైనారిటీ సంక్షేమ సంఘం నంబర్ 8520860785 సంప్రదించాలని కోరారు.

## భద్రాచలం ఏషియన్ థియేటర్ వద్ద పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఆందోళన




**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** ఏషియన్ థియేటర్ వద్ద పవన్ కళ్యాణ్ అభిమానుల ఆందోళన గడిచిన కొన్ని గంటలుగా కొన సాగింది. షో టికెట్లు ఫ్యాన్స్ కు ఇవ్వకుండా, కేవలం నలుగురు వ్యక్తులకు మాత్రమే ఇచ్చారన్న ఆరోపణలతో ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్ షో రద్దు అవుతుందని ఫ్లెక్సీలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. తక్కువ సంఖ్యలో మాత్రమే టికెట్లు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అభిమానులు టికెట్ కౌంటర్ మరియు థియేటర్ తాలూకు గేట్లకు తాళాలు వేయారు. టికెట్లను బ్లాక్‌లో అమ్మడం, ఫ్యాన్స్ కు సరైన అవకాశాలు ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల పవన్ కళ్యాణ్ అభిమానుల ఆందోళన తీవ్రతను చేరింది.

## 7 లీటర్ల నాటుసారా స్వాధీనం

**బూర్గంపహాడ్, సెప్టెంబర్24 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టినగర్, అంజనాపురం, మొరంపల్లి బంజర, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక గ్రామాలలో బుధవారం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం దాడులు నిర్వహించారు. 7లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తుల మీద కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది రామక్రిష్ణ గౌడ్, హబీబ్ పాషా, గురవయ్య, సుమంత్, రమేష్, శ్రావణి పాల్గొన్నారు.

## అఖిల జగన్మాత.... సంతానలక్ష్మి అమ్మ వారు దర్శించి తరించిన భక్తజనం

- నేడు గజలక్ష్మి అలంకారం

**భద్రాచలం, సెప్టెంబరు 24,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో బుధవారం నుంచి శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవప్రయుక్త విజయదశమి వేడుకల్లో భాగంగా శ్రీ లక్ష్మి తాయారు అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతానలక్ష్మిని అఖిల జగన్మాతరం, అస్వన్మాతరం అంటూ భగవత్ రామానుజాచార్యులు కీర్తించారు. చతుర్భుజాలతో దర్శనమిచ్చే అమ్మవారిని ఎవరైతే ఆరాధిస్తారో వారికి సంతానపరమైన సమస్యలు తొలగుతాయని, సప్తసంతానాలు అభివృద్ధి చెందుతాయని వైదిక సిబ్బంది పేర్కొన్నారు. అలాగే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, బాలకాండ పారాయణంను వైదిక సిబ్బంది పఠించారు. రామాలయం ఆవరణలోని చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్రావు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక సిబ్బంది పాల్గొన్నారు. కాగా నేడు అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## భద్రాచలంలో హాస్టల్ వర్కర్ల బిక్షాటన

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** జీతాలు తగ్గించి మా నోటి కాడ బువ్వ లాక్కోవద్దంటూ గిరిజన హాస్టల్ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు తగ్గింపుకు నిరసనగా వారు బుధవారం సమ్మె చేపట్టి, ఐటిడిఏ కార్యాలయంలో బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు హీరాలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వారికే ప్రభుత్వం ఇలాంటి అన్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన జీవోలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ జీతాలు తగ్గించడం పూర్తిగా అన్యాయం అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ, గిరిజన సంక్షేమ శాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీతాలు తగ్గించే జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు తగ్గిస్తే తప్పనిసరిగా ఆందోళనను మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో నాయకులు మంగమ్మ, లక్ష్మి, రామారావు, శ్యామల, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





## భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక అభిషేకం, నిత్యకల్యాణం





**భద్రాచలం ,సెప్టెంబర్ 24,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం సందర్భంగా నిత్యకల్యాణ మండపంలో తొలుత స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం గావించారు. అలాగే నిత్యన్నదాన పథకంకు విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన లలిత కిషోర్ రూపవాణి దంపతులు రూ. లక్ష విరాళంగా అందజేశారు.

## చలో కోదాడ

- **పివైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి**
- **పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భానుచందర్, పిలుపు**




**టేకులపల్లి, సెప్టెంబర్24, ప్రజాజ్యోతి:** కోదాడలో ఈనెల 25, 26న జరిగే ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శులు నోముల భానుచందర్, పివైఎల్ జిల్లా నాయకులు తోటకూరి సతీష్ పిలుపునిచ్చారు. టేకులపల్లి మండల కేంద్రంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో పివైఎల్ జిల్లా నాయకులు తోటకూరి సతీష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువకులకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ హామీలు అమలు చేయడంలో విఫలమైందని వారు ఆరోపించారు.ఈ దేశ భవిష్యత్తు యువత మీదనే ఆధార పడి ఉందని నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టాలలో మార్పుల వలన నిరుద్యోగం పెరిగిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.చదువుకున్న చదువులకు ఉద్యోగాలు లేఖ రాత్రింబవళ్లు కష్టపడి కనిపెంచిన తల్లిదండ్రులకు కనీసం బువ్వ కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడిందని మరోపక్క ఏఐ పేరుతో ఉన్న ఉద్యోగాలను కూడా తీసివేస్తున్నారని వారు ఆరోపించారు.యువతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని హిందూ మతోన్మాదం పేరుతో యువతను రెచ్చగొడుతూ ఉద్యోగాలు ఇవ్వకుండా కులం,మతం,మద్యం, డ్రగ్స్ మత్తులో యువతను పెంచి పోషిస్తున్నారని ఆయన ఆరోపించారు. కావున ఈ దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతరంగం మీదనే ఉన్నదని అలాంటి యువతరం ముందుకు రావాలని వారి రాజకీయ చైతన్యం కోసం దేశంలో జరుగుతున్న మార్పుల పై ఈ నెల 25, 26వ తేదీలలో సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం కేం ద్రంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని వారు అన్నారు. వైద్యరంగంలో ఉన్న సమస్యలుపరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రైవేట్ వైద్యరంగంలో, మెడికల్ మాఫియాలో జరుగుతున్న దోపిడిని అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ వా రి పబ్బం గడుపుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే పేద ప్రజలను వైద్యం పేరుతో పీల్చి పిప్పి చేస్తున్నారని అన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవిత చరిత్ర, మతం ఫాసిజం, నిరుద్యోగ సమస్య మన కర్తవ్యం అనే అం శాలపై క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ రాజకీయ శిక్షణ తరగతులకు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **ఇందిరమ్మ నమూనా భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం**



**బూర్గంపహాడ్, సెప్టెంబర్24 (ప్రజా జ్యోతి):** సొంతింటి కల నెరవేరుస్తూ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపహాడ్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నమూనా భవనాన్ని ఆయన ప్రా రంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముందుగా ఆయన కొబ్బరికా య కొట్టి ఇంట్లోకి అడుగుపెట్టారు. అనంతరం నమూనా భవనంలో ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఎ మ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కళ నెరవేరుస్తుందని అన్నారు . నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లును దశలవారీగా అందరికీ మంజూరు చేస్తానని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు నిర్మించే ఇల్లు 400 చదరపు అడుగులకు తక్కువగా ఉండకూడదని, 600 చదరపు అడుగులను మించకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య విలేకరులు వారధిగా పని చేస్తున్నారని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని చెప్పారు.అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మరియు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానని అన్నారు.అనంతరం ఉపాధి హామీ కూలీలకు పనిముట్లను అందజేశారు.మండల వ్యాప్తంగా రూ.13,1228 లక్షలతో 377 టీములకు గాను 6885 మంది ఉపాధి హామీ పథకం ద్వారా ఈ పనిముట్లను అందుకుంటున్నారని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జమలా రెడ్డి,ఏవో శంకర్,ఏఈ సందీప్ ,ఎంపీఓ బాలయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి,హౌసింగ్ ఏఈ సత్య,ఎంఈఓ సింహరాజు, ఆస్పత్రి సూపరిడెంట్ ముక్కంటేశ్వరరావు, మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, టిపిసిసి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ ఖాన్,రోశిరెడ్డి భజన ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**భద్రాచలం, సెప్టెంబర్ 24,ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర బతుకమ్మ పండుగ ఉత్సవాలలో భాగంగా భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులం ఆర్‌సీఓ శ్రీమతి అరుణకుమారి మాట్లాడుతూ పండుగ విశిష్టతను వివరించారు.బుధవారం నాడు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం ఆవరణలో మహిళా ఉద్యోగులు, ఐటిడిఏ నివాస గృహ సముదాయ మహిళలు వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ –“ప్రకృతిని కాపాడుకోవడం, ప్రకృతి గొప్పతనాన్ని గుర్తించి గౌరవించుకోవడమే బతుకమ్మ పండుగ అంతర్యమని మన పెద్దలు మనకు అందించారు. మన జీవితం ప్రకృతితో ముడిపడి ఉంది. ప్రకృతి బాగుంటే మానవాళి బాగుంటుంది. అందుకే ప్రకృతిని దైవంగా భావించి పూజిస్తాం. ఔషధ గుణం కలిగిన పూలతో బతుకమ్మ వేడుక జరుపుకోవడం, అందరూ ఆరోగ్యంగా ఉండాలనే మన సంప్రదాయ బోధన. అందుకే బతుకమ్మను బ్రతుకు ఇచ్చే తల్లి అని పిలుస్తాం” అని అన్నారు.అలాగే గిరిజన యువతీ యువకులు తమ సంస్కృతి, సంప్రదాయాల అంతర్యాన్ని గుర్తించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. “ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుంది. బతుకమ్మ పండుగ మన తెలంగాణ రాష్ట్ర గౌరవ పండుగ కావడం మన అందరికీ గర్వకారణం” అని తెలిపారు.నూటికి నూరుశాతం వెనుకబడిన గిరిజనుల సంక్షేమం, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న గిరిజన అభివృద్ధి సంస్థలో ఉద్యోగులు, మహిళా ఉద్యోగుల సమక్షంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనందకరమని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఈడ్ కళాశాల వార్డెన్ ధనలక్ష్మి, కళాశాల జీసీడీవో అలివేలుమంగ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, ఐటిడిఏ మహిళా ఉద్యోగులు మాధవి, భవాని, ప్రియాంక, అరుణ, నవ్య, నివాస గృహాల మహిళలు మరియు చిన్నారి బాలికలు పాల్గొన్నారు

## వైరా నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యం ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- **8 కోట్ల విలువైన అభివృద్ధి పనులు.**
- **ఐదు కోట్లతో మూడు కిలోమీటర్ల రోడ్డు వెడల్పు.**
- **గ్రామ పంచాయతీ పక్క భవనాలు**
- **సీసీ రోడ్లు ప్రారంభోత్సవం.**





**జూలూరుపాడు, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి ) :** జూలూరుపాడు మండల వ్యాప్తంగా గురువారం 8 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ శ్రీకారం చుట్టారు మండల పరిధిలోని జూలూరుపాడు నుండి పాపకొల్లు మధ్యగల మూడు కిలోమీటర్ల రోడ్డును వెడల్పు చేయటంలో భాగంగా ఐదు కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం సూరారం, కొత్తూరు, గుండ్లరేవు గ్రామాల్లో ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ పనుల్లో భాగంగా 60 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన పంచాయతీ పక్క భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు వీటితోపాటు రామచంద్రపురం,వినోహ నగర్ గ్రామాలలో సిసి రోడ్లను సైతం ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతేకాక 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా చెక్కులను పంపిణీ చేశారు. డి. ఎం. ఎఫ్. టి నిధులతో సుమారు ఐదు కోట్లతో రోడ్డు వెడల్పును రెండు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలుపరుస్తున్నామని అన్నారు. 10 సంవత్సరాల్లో ఏ ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వని గత ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాన్ని అప్పుల్లోకి తీసుకువెళ్లిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితి ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు తో పాటు రేషన్ కార్డులను సైతం ప్రభుత్వం మంజూరు చేస్తుందని అన్నారు. ఉచిత బస్సు,గృహలక్ష్మి ,గృహజ్యోతి పథకాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు ఆయన ఈ సందర్భంగా బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు దుర్గాప్రసాదరావు, లేళ్ల.వెంకట రెడ్డి,మాలోత్ మంగీలాల్ నాయక్, రాంశెట్టి. రాంబాబు,లచ్చు నాయక్,మాజీ సర్పంచులు శాంతి . రాందాస్ అమ్మనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆది కర్మయోగి అభియాన్ – భద్రాద్రి జిల్లాలో 130 గ్రామాల్లో రచ్చబండలు



**భద్రాచలం, సెప్టెంబర్ 24,ప్రజాజ్యోతి :** మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ అఫైర్స్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐటిడిఏ పరిధిలో ఆది కర్మ యోగి అభియాన్ కార్యక్రమాలు సెప్టెంబర్ 23 నుంచి 30 వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని 19 మండలాల 130 గ్రామాల్లో ఆది సేవా కేంద్రాలు ప్రారంభించి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయన మాట్లాడుతూ గ్రామాలలో నోడల్ అధికారులు, ప్రత్యేక అధికారులు, డీఎంటీలు, బీఎంటీలు మరియు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై ఆది సేవా కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. అలాగే ఇంటింటికి తిరిగి సమస్యలు సేకరించి, గ్రామసభల్లో ప్రజల సమక్షంలో తీర్మానాలు సిద్ధం చేసి, ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు. భద్రాద్రి జిల్లాలోని దుమ్ముగూడెం, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం, అశ్వరావుపేట, బూర్గంపాడు, చంద్రుగొండ, చర్ల, దమ్మపేట, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, ములకలపల్లి, పాల్వంచ, పినపాక, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లందు మండలాల గ్రామాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు.

## బాత్రూంలో కిందపడి మృతి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (ప్రజా జ్యోతి):** బాత్రుంకు వెళ్లి కాలు జారీ కిందపడి గొంతుకు తీవ్ర గాయం కావడంతో రామవరం పంజాబ్ గడ్డకు చెందిన బైరీమల్ల మధుసూధన్(41) మృతి చెందిన ఘటన బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబందించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. రామవరం పంజాబ్ గడ్డ బస్తీకి చెందిన బైరీమల్ల మధుసూదన్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనంను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మధుసూదన్ పనికి వెళ్లేందుకు స్నానం చేయడానికి బాత్రుంకు వెళ్లి జారీ కిందపడినట్లు, గొంతుకు తీవ్రగాయం అయింది. 108 కు ఫోన్ చేసి మధుసూదన్ ను కొత్తగూడెం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సను పొందుతూ మరణించడం జరిగింది. ఈ విషయమై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, తోమ్మిదోవ తరగతి చదువుతున్న కూమారుడు ఉన్నారు.

## ప్రతిఇంట పూల సౌరభాలు గుభాలిస్తున్నాయి

- నాలుగవ రోజు నానే బియ్యం బతుకమ్మతో ఆడబిడ్డల సంబరాలు





**అశ్వారావుపేట, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** నానే బియ్యం బతుకమ్మను నాలుగవ రోజు ఆడబిడ్డలు అత్యంత ఉత్సాహంతో జరుపుకుంటున్నారు. ఆశ్వయుజ మాసంలో వచ్చే బతుకమ్మ పండుగతో ప్రతీ ఇంటా పూలసౌరభాలు గుభాళిస్తున్నాయి. రంగు రంగుల పూలతో ప్రతీ లోగిలి శోభాయమానంగా వెలుగొందుతోంది. ఆడపడుచులు ఆడంబరంగా జరుపుకునే నాలుగవ రోజు నానే బియ్యం బతుకమ్మకు నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యంగా నివేదిస్తారు. తంగేడు, గునుగు పూలతో నాలుగంతరాలు అంటే నాలుగు అంతస్థులుగా బతుకమ్మను పేర్చి పూల పైన గౌరమ్మను పెట్టి ఆడబిడ్డలంతా ఆట పాటలతో బతుకమ్మను కొలుచుకుంటారు. నానబెట్టిన బియ్యం బెల్లంతో కలిపి ముద్దలు చేసి.. ప్రసాదంగా పెట్టి వాయనాలుగా పంచుకుంటారు. ప్రతి ఇంట్లో పూల పండుగ పరవశంలో ముంచెత్తుతోంది. ప్రకృతిని, పూలను ఆరాధించే అత్యంత అరుదైన ఈ పండుగ కన్నులనిండుగా జరుగుతుంది.

## మండల సమస్యలు పరిష్కరించండి

- సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు



**చర్ల, సెప్టెంబర్ 24:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం చర్ల మండల సీపీఎం కమిటీ మండల సమస్యలపై మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాలలో అంతర్గత రోడ్లు నిర్మించాలని, డ్రైనేజీలపూడిక తీయాలని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అన్నారు .అదేవిధంగా గుంపెనగూడెం గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా లేదని గ్రామస్తులు చెప్పడం జరిగింది అని వీధిలైట్లు సకాలంలో వెలగడం లేదని రాత్రిపూట చాలా ఇబ్బందికరంగా ఉంటుందని అక్కడ ఉన్నటువంటి ప్రజల ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. కొత్తపల్లి గ్రామంలో అంతర్గత రోడ్డు డ్రైనేజీ శుభ్రం చేయాలని కోరారు ఇప్పటికే మండలంలో అనేకమంది విష జ్వరాలతో బాధపడుతున్నారని బ్లీచింగ్ పౌడర్ ప్రతి గ్రామంలో చల్లించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రామారావు కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బందెల చంటి. కొత్త పల్లి గ్రామస్తులు గుంపెను గూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పూరి గుడిశలు లేని గ్రామం, పేదలకు పక్క ఇల్లు లక్ష్యం




**టేకులపల్లి, సెప్టెంబర్ 24, ప్రజాజ్యోతి:** మండలంలోని బేతంపూడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళు లబ్దిదారి బచ్చలకూరి సురేష్ ఇంటి నిర్మాణం స్లాబ్ లెవల్ చేరుకున్న సందర్భంగా బుధవారం ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ ఆహ్వానించి వారితో కొబ్బరికాయ కొట్టించి స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్ మాట్లాడుతూ పూరి గుడిశలు ఉన్న నిరుపేదలకు పక్క ఇల్లే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్ల పథకాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని అని అన్నారు.అనంతరం బేతంపూడి గ్రామం నందు ఓ వ్యవసాయదారుని పత్తిచేనులో వేములపల్లి సమ్మయ్య విఎస్ ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీల్డ్ విజిట్ లో పాల్గొని పత్తిచేనుని సందర్శించారు.ఈ కార్యక్రమంలో మండలకాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, ఇస్లావత్ రెడ్యానాయక్, భూక్యా సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



**పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 24:** పాండురంగాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు.ఉత్సవాల్లో భాగంగా విగ్రదాతగా పోతురాజు రామయ్య విగ్రహం అందించారు.లక్కీ డ్రా కార్యక్రమంలో ఫ్రిజ్, సైకిల్, మిక్సీలు వితరణ చేయగా, గ్రామ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ కోరింది.ఈ రోజు అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారములో దర్శనమివ్వనున్నారు.




## ప్రతి కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు

- జిఎస్టి తగ్గింపు నిర్ణయంతో ప్రజల మొహాల్లో ఆనందం కనిపిస్తుంది... నెక్స్ట్ జెన్ జీఎస్టీ ప్రచార కమిటీ జిల్లా కో కన్వీనర్ బండారు చంద్రశేఖర్



**అశ్వారావుపేట. సెప్టెంబర్ 24,ప్రజాజ్యోతి :** కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని ఇటువంటి నిర్ణయం తీసుకునేందుకు బలమైన నేత ప్రభుత్వం ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమని నెక్స్ట్ జన్ జిఎస్టి ప్రచార కమిటీ జిల్లా కో కన్వీనర్ బండారు చంద్రశేఖర్ అన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు మెట్ట వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని సత్య సాయి బాబా కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుని దేశవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందిందన్నారు నిత్యవసర వస్తువులపై పన్నులు తగ్గడంతో వినియోగదారులు, చిన్న వ్యాపారులకు లబ్ది చేకూరుతుందన్నారు. పేద మధ్య తరగతి కుటుంబాల వారికి నెలవారి బడ్జెట్ లో ఎంతో ఊరట కలుగుతుందని ఖర్చులు తగ్గడంతో పాటు డబ్బును పొదుపు చేసే అవకాశం ఉందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్విటి కొండ,మండల ప్రధాన కార్యదర్శి రాయుడు ఆంజనేయులు, పమిడి లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షులు జల్లపల్లి అరవింద్, మండల కార్యదర్శులు శీమకుర్తి తాతా శ్రీనివాసరావు, మేడవరపు కృష్ణచైతన్య, శీమకుర్తి సుబ్బారావు, పమిడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రులో భాగంగా మహా అన్నదానం



**టేకులపల్లి, సెప్టెంబర్24, ప్రజాజ్యోతి:** కనకదుర్గ దేవి నవరాత్రులలో భాగంగా టేకులపల్లి బస్టాండ్ సెంటర్ దుర్గామాత ఉత్సవాలు మీ ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు,యువత తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- డ్రగ్స్,గంజాయి మత్తు పదార్థాలపై కఠినంగా వ్యవహరిస్తాం.
- ఆన్లైన్ గేమ్స్ జోలికి వెళ్లకండి
- గుట్కాలు, పాన్ మసా లాపై యువతకు అవగాహన




**టేకులపల్లి,సెప్టెంబర్24, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు టేకులపల్లి బోడు సై పి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు. ఆశ చూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు.పోలీసులను ఫోన్ చేసాం మీ ఖాతా నెంబరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంది పోలీస్ శాఖ పరంగా మీకు సహాయం చేస్తామని తెలిపిన అటువంటి వాటిని నమ్మవద్దని మీకు అందుబాటులో ఉన్న బ్యాంకు వెళ్లాలని తెలిపారు.పోలీస్ శాఖకు బ్యాంకు ఖాతాల వివరాలు అవసరం లేదని తెలిపారు.మీకు పదేపదే ఫోన్ చేసి విసిగిస్తే మీ అందుబాటులో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేయాలని తెలిపారు.మొబైల్ ఫోన్లకు అన్నోన్ నెంబర్ల నుంచి ఫోన్ చేసి బ్యాంకు లోన్లు ఇస్తామని నమ్మించడానికి చూసి మన దగ్గర అమౌంట్ లాక్కుంటారని, అటువంటి వాటిని ఎవరూ నమ్మొద్దని తెలిపారు.ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు.

### గుట్కాలు,పాన్ మసా లాపై యువతకు అవగాహన

యువత ఇష్టానుసారంగా గుట్కా,పాన్ మసాలాకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు.గుట్కాల వల్ల నోటి క్యాన్సరు,పేరు క్యాన్సర్లు వచ్చి చాలా మంది దుర్మరణం అయిన సంఘటన చాలా ఉన్నాయి.యువత మంచి అలవాట్లకు బానిసలు కావాలి కానీ, మహమ్మారి గుట్కాపాన్ మసాలాకు అలవాట్లు అయి కుటుంబానికి దూరం కావద్దని వారు తెలిపారు.ఇప్పుడు కొత్తగా పాన్ మసాలాలలో గంజాయి, కోకైన్,ప్రభుత్వాన్ని నిషేధిత మత్తు పదార్థాలు గుట్కా పాన్ మసాలాల్లో కలిసి వస్తున్నాయి.వీటిపై యువత చాలా అవగాహన కలిగి ఉండాలని వారు తెలిపారు. మీ ఊరిలో ఒక నలుగురు బాగుపడి ఆ నలుగురు ఇంకో నలుగురిని బాగు చేసి అలా ఊరు మొత్తాన్ని బాగు చేసుకోవాలని తెలిపారు. గంజాయి,మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుపోతుందని బోడు ఎస్సై పి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.గ్రామాల్లో గంజాయి సాగుకు పాల్పడినా,రవాణా చేసినా ప్రభుత్వ సంక్షేమ పథకాలురద్దవుతాయన్నారు.మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని,మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని వారు తెలిపారు. గంజాయి,ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో గొప్పవాళ్ళను చేయాలనే ఆశతో ఉంటే కొంత మంది యువత డ్రగ్స్ కు అలవాటుపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు.డ్రగ్స్ సరఫరా చేసే వారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.యువత ఎక్కువమంది మత్తుపానీయాలకు,మత్తు పదార్థాలకు బానిసలై రహదారి ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు వదులుకుంటున్నారని అన్నారు. కుటుంబం ఆర్థిక పరిస్థితి బాగుండాలంటే యువతే కీలకమని అటువంటి యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. గంజాయి రవాణా విక్రయాలు, గంజాయిని వాడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, గంజాయితో పాటు,మత్తు కలిగించే కొన్ని గ్లాసులను అతికించే గమ్ము సైతం వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఆన్లైన్ గేముల జోలికి వెళ్లొద్దు అని ఈ వ్యసనం వదలలేక అప్పులు చేస్తున్నారు. రుణయాప్ లను ఆశ్రయిస్తున్నారు.అప్పులు తిరిగి చెల్లించలేక ఆ ఒత్తిడిలో చదువులను గాలికి వదులుతున్నారు. అప్పుల ఒత్తిడి ఇంకా ఎక్కువైతే ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఇలా యువత ప్రాణాలు తీసే స్థాయికి బెట్టింగ్ మహమ్మారి విస్తరించడం సర్వత్రా ఆందోళన కల్గిస్తోంది. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టి బెట్టింగ్లకు పాల్పడకుండా చూడాలని వారు తెలిపారు. అలాగే ఆన్లైన్ గేమ్లు ద్వారా రమ్మీ, లూడో, పబ్జి ఇలాంటి అనేక ఆన్లైన్ గేమ్లు ఫోన్లలో ఆడి లక్ష నుంచి కోట్ల వరకు పోగొట్టుకుంటున్నారు అని ఎస్సై తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఎఐటీయూసీ గేట్ మీటింగ్

- – కార్మిక హక్కుల సాధనలో ఎఐటీయూసీ ముందుంటుంది : కె. సారయ్య



**కోయగూడెం, సెప్టెంబర్ 24, ప్రజాజ్యోతి:** కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఎఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ఎఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, ఇల్లందు ప్రాంత సంఘటనా కార్యదర్శి సుందర్, బ్రాంచ్ కార్యదర్శి ఎం.డి. నజీర్ అహ్మద్ తదితరులు హాజరయ్యారు. సారయ్య, నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఆశించిన లాభాల వాటా విషయంలో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతింటి పథకం, వడ్డీ లేని రుణం,ఇతర పెరక్స్ విషయాలు సిఅండ్ఎండి బలరాం తో జరిగిన నిర్మాణాత్మక చర్చలలో ప్రస్తావనకు వచ్చినట్లు కార్మికులకు వివరించారు. సింగరేణి కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ఎఐటీయూసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నమ్మి, కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఐఎన్టీయూసీ సీనియర్ నాయకుడు,ఎస్టీ సంఘం ఇల్లందు శాఖ కార్యదర్శి మాలోత్ హరి సింగ్ సహా ముప్పై మంది కార్మికులు బుధవారం ఎఐటీయూసీ యూనియన్‌లో చేరారు.వారికి నాయకులు కండువాలు కప్పి ఆహ్వానించారు.కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు యూనియన్ కృషి చేస్తుందని, దసరా పండుగ సందర్భంగా వారికి రూ. 5,500 లాభాల వాటా అందజేసినట్లు నాయకులు వెల్లడించారు. కోయగూడెం యూనియన్ విజయాలు, కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండే తీరుతో ప్రేరణ పొందిన కార్మికులు స్వచ్ఛందంగా ఎఐటీయూసీ యూనియన్‌లో చేరారని వారు తెలిపారు.భవిష్యత్‌లో ఇల్లందు పరిరక్షణకు జరగబోయే ఉద్యమాలలో అందరూ ఒకే తాటిపై రావాలని,కార్మిక హక్కుల సాధనలో ఎర్రజెండా ఎల్లప్పుడూ తోడుంటుందని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయక కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, పిట్ సహాయక కార్యదర్శి స్కె సర్వర్, సామల శ్రీనివాస్, కరుణ శంకర్, బ్రాంచ్ కమిటీ సభ్యుడు అజ్మీర కిషోర్, జి.ఎ. శ్రీనివాస్, దల్ సింగ్, అయ్యోరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ పరిధిలో సీజ్ చేసిన ఇసుక వేలం



**బూర్గంపహాడ్, సెప్టెంబర్24 (ప్రజా జ్యోతి ):** రెవెన్యూ అధికారులు,పోలీసులు సీజ్ చేసిన ఇసుకను బుధవారం వేలం వేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సుమారు 30ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గోనెల సతీష్ కుమార్ రూ.61,200లకు ఇసుక హక్కులను స్వాధీనం చేసుకున్నారు.రెవెన్యూ శాఖకు వేలం డబ్బులు చెల్లించిన అనంతరం ఇసుకను తరలించేందుకు అధికారులు నిర్ణయించారు.నిబంధనల మేరకు అమ్ముకోవచ్చని తహశీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిటీ సమ్మయ్య,ఆర్ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకారములో అమ్మవారి దర్శనం



**పాల్వంచ (రూరల్ ), సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** కేశ వాపురం–జగన్నాథ పురం గ్రామంలోని శ్రీ కనక దుర్గ దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మూడవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారములో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజావిధానాలు,రుద్రహోమం, మధ్యాహ్నం ఛండీహోమం, లక్షకుంకుమార్చన ప్రత్యేకంగా నిర్వహించారు. సాయంత్రం నీరాజన,తీర్థప్రసాద వితరణ అనంతరం రాత్రి కూచిపూడి నృత్యం ప్రదర్శించనున్నారు.ఈ రోజు అమ్మవారు శ్రీ గాయత్రీదేవి అలంకారములో దర్శనమివ్వనున్నారు.

## అక్రమంగా ఇసుక రవాణా, తవ్వకాలు నిర్వహించిన కఠిన చర్యలు తప్పవు

- సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి




**టేకులపల్లి,సెప్టెంబర్24,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం బోడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సంపత్ నగర్ గ్రామ శివారులోని వాగును బుధవారం టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు పోలీస్ స్టేషన్ ఎస్ .ఐ. పీ. శ్రీనివాస రెడ్డి లు తనిఖీ నిర్వహించారు.వాస్తవిక స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరగకూడదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక రవాణా అనేది చట్ట విరుద్ధమని వారు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన, అక్రమ ఇసుక దందా నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ కూపన్లలో ఉన్నటువంటి కాలపరిమితిలో మాత్రమే ఇసుక రవాణా చేయాలని వారు తెలిపారు. ఖచ్చితంగా టేకులపల్లి తాసిల్దార్ అనుమతులతోనే ఇసుక రవాణా చేయాలి లేనిచో వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## భద్రాచలంలో హాస్టల్ వర్కర్ల బిక్షాటన

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 24, ప్రజా జ్యోతి:** జీతాలు తగ్గించి మా నోటి కాడ బువ్వ లాక్కోవద్దంటూ గిరిజన హాస్టల్ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు తగ్గింపుకు నిరసనగా వారు బుధవారం సమ్మె చేపట్టి, ఐటిడిఏ కార్యాలయంలో బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు హీరాలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వారికే ప్రభుత్వం ఇలాంటి అన్యాయం చేస్తుందా అని ప్రశ్నించారు. బీఆర్ ఎస్ పాలనలో అమలు చేసిన జీవోలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ జీతాలు తగ్గించడం పూర్తిగా అన్యాయం అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ, గిరిజన సంక్షేమ శాఖ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీతాలు తగ్గించే జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు తగ్గిస్తే తప్పనిసరిగా ఆందోళనను మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో నాయకులు మంగమ్మ, లక్ష్మీ, రామారావు, శ్యామల, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

